## ప్రజల డాక్టర్ రామనాథం

ప్రజల డాక్టరమ్మో
మాయన్నా రామనాథం
పేదోల్ల డాక్టరమ్మో
మాయన్నా రామనాథం
పౌరహక్కుల కోసం
ప్రాణాలు బలిపెట్టిన ॥ప్రజ॥

పసిపిల్ల లెత్తుకోని
వారికన్న తల్లులొస్తే
సావు బతుకులల్లో
అరె కన్నతల్లులొస్తే
వొడిలోకి తీసుకోని
ఓర్పుతో చూసెటోడు
ప్రాణంతో కుస్తిపట్టి
ప్రాణాలే పోసెటోడు ॥ప్రజ॥

పంటలను చెరిచె హక్కు
ఏ పార్టీ ఇచ్చెనందు
గుడిశెలను కూల్చెహక్కు
ఏ గురుడు ఇచ్చెనందు
కష్టైని కాల్చెహక్కు
ఏ చట్టమిచ్చె నందు ॥ప్రజ॥

పేదోల్ల గుడిసెమీద
అరె గుండ్లు పేల్చెటోన్ని
పోలీసు స్టేషనుల్లో
చెల్లెల్ని చెరిచెటోన్ని
అదురు బెదురులేక
నిలదీసి అడిగెటోడు
నిజనిజాల కమిటేసి
నిజం లాగేటోడు ॥ప్రజ॥

పోలీసు గూండ గాండ్లు
మారు వేషాలేసుకొని
అన్నకణత మీద
కసితోని కాల్చినారు
ఐ.జీ పి.. యస్.పి.. సి.ఐ.
ఎగిరెగిరి నవ్వినారు
గుండెల్లో గుండ్లు దించి
వాళ్ళగొయ్యి తవ్వుకుండ్రు ॥ప్రజ॥

అరె అన్న గుండెమీదా
గన్నులు పేలగానే
ఓరుగల్లు పల్లెలన్ని
అరె చిన్నబోయినాయి
పసిపిల్లలున్న తల్లి
గొల్లున ఏడ్చినాది
కనుకున్న కన్నతల్లి
కన్నీరు పెట్టినాది ॥ప్రజ॥

మా గోపి రాజన్నను
గూండాలు కాల్చివేస్తే
గొంతెత్తి దేశమంతా
ఈ వింత చెప్పినాడు
రాజన్న బాటలోనా
తన రుణం తీర్చుకుండు ॥ప్రజ॥

బుద్ధున్న బుద్ధిజీవి
చెమటోడ్చె కష్టజీవి
చేతులుల్లో చేయివేసి చేయాలి పోరు
అందు
మెదడున్న మేధావి
పోరన్నకు తోడండు
పోరాట దారిలోనా
పోతాయి బాధలండు ॥ప్రజ॥



But, because I tried to extend your liberties,
mine were curtailed.
Because I tried to rear the temple of freedom
for you all I was thrown into the cell of
a felon's jail,...
Because I tried to give voice to truth, I was
condemned to silence. ....
You may say this is not a public question.
But it is !

*Remembering Dr. Ramanadham*

మీ హక్కులకోసం పోరాడుతున్నానని
నాకు లేకుండా చేశారు


మీ అందరికోసం స్వేచ్ఛా మందిరాన్ని నిర్మిస్తున్నాని
నన్ను ఖైదు చేశారు

సత్యానికి గొంతుక నిస్తున్నానని
నా గొంతు నొక్కేశారు

ఇది నా స్వంత గొడవ అంటారేమో. కాదు
ప్రజల సమస్యే నంటాను.

— ఒక యూరప్ కార్మికుడు

ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం



# పౌరహక్కుల రామనాథంకు జోహార్లు

అయిదు సంవత్సరాల తరువాత డాక్టర్ రామనాథంగారి వర్ధంతిసభను మొదటిసారిగా వరంగల్‌లో జరుపుతున్నాం. గత 4 ఏళ్ళగా రాష్ట్రమంతటా సెప్టెంబర్ 3న డాక్టర్‌గారిని స్మరించుకొన్నాం. శ్రీకాకుళం నుండి చిత్తూరుదాకా, వికారాబాద్ దాకా, సభలుపెట్టాం. దేశంలోని పౌరహక్కుల సంస్థలు సెప్టెంబర్ 3ను జాతీయ పౌరహక్కుల దినంగా గుర్తించి ఢిల్లీనుండి నాగ్‌పూర్ దాకా, బొంబాయి నుండి కలకత్తా దాకా, సంస్మరణ సభలూ సమావేశాలూ జరుపుతూ ఉన్నాయి. అయితే ఆయన డాక్టరుగా, ప్రజల హక్కులకోసం నిలబడ్డ మంచి మనిషిగా, జనం ప్రేమకు పాత్రుడయిన వరంగల్‌లో మట్టుకే ఏ సంస్మరణా నిర్వహించలేకపోయాం. ప్రభుత్వమే ఒక గూండా అయి ఒక పౌరుడిని హత్యచేస్తే విచారణ లేకపోగా, కేసు లేకపోగా, శిక్ష లేకపోగా, కనీసం ఆ వ్యక్తిని స్మరించుకొని నాలుగు మాటలు చెప్పుకునే పరిస్థితి సహితంలేని రాక్షస పాలనలో బ్రతుకుతున్నాం.

కూలి సరిగ్గా ఇవ్వని భూస్వాములను కూలి అడగడానికీ, భూములు పంచని పాలకులను భూములు అడగడానికీ, అడవులను ఆక్రమించుకొన్న ప్రభుత్వానికి ఇవి గిరిజనుల అడవులేనని చెప్పడానికీ, కార్మికుల పని పరిస్థితులు మెరుగుపరచండని యజమానులను నిలదీయడానికీ, పండించిన పంటకు గిట్టుబాటుధర అడగడానికీ. పంటపండించడానికి నీళ్ళూ కరెంటూ ఎరువులూ మందులూ చవగ్గా ఇవ్వాలని అడగడానికీ, తమ భాషకూ మతానికీ సంస్కృతికీ న్యాయం చేకూర్చాలని డిమాండుచేయడానికీ, జనం ఐక్యమై ఆందోళనచేస్తే దానిని తీవ్రవాదం అనడానికి వీలులేదని డాక్టర్ రామనాథం అన్నారు. ఆ ఆందోళన ఏ సామాజిక దృక్పథాన్ని ఎంచుకొన్నా ఏ పోరాట రూపాన్ని అనుసరించినా దానినొక రాజకీయ పోరాటంగా పరిగణించి రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప శాంతి భద్రతల సమస్యగా పరిగణించి సంఘ వ్యతిరేక ముద్రవేసి హింసాత్మకంగా అణచడానికి వీలులేదన్నారు. ఆందోళనకారులు నేరాలుచేస్తే మంచిపని చేసారని ఆయన అనలేదు, చట్టబద్దంగా వాళ్ళను శిక్షించవద్దనలేదు. కానీ ఆందోళననే ఒక నేరంగా భావించడానికి వీలులేదన్నారు. ఇవన్నీ ఆయన నమ్మాడు కాబట్టే పౌరహక్కుల సంఘం నిర్మాతలలో ఒకడయి వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షునిగానూ రాష్ట్ర ఉపాధ్యక్షునిగానూ బాధ్యత స్వీకరించి పనిచేసారు. వరంగల్‌లో అత్యంత జనాదరణ పొందిన పిల్లల డాక్టరుగా తన విధి నిర్వహణను కొనసాగిస్తూనే పౌరహక్కుల పరిరక్షణ గురించి తపన చెందారు, కృషిచేసారు.

హత్యలు చేసే పోలీస్ ఆఫీసర్లను ప్రభుత్వం శిక్షించాలని ఆయన అన్నారేగానీ వాళ్ళమీద ప్రతీకారం తీర్చుకోవాలని ఆయన ఎన్నడూ అనలేదు. అయినా ఆయన సమర్థించని ప్రతీకారం వాస్తవమయిననాడు పిరికిపందలయిన పోలీసులకు తమ తప్పును వేలెత్తిచూపిన ఆ పౌరహక్కుల నాయకుడే కనిపించాడు. దుర్మార్గాన్ని మానుకోలేని వాళ్ళకు దాన్ని ఎత్తిచూపే వాళ్ళే శత్రువులవుతారు. కాజీపేట ఎస్. ఐ. యాదగిరిరెడ్డిని నక్సలైట్లు హత్యచేస్తే దానికి ప్రతీకారంగా మరుసటిదినం (1985 సెప్టెంబర్ 3) యావత్ జిల్లా పోలీసు యంత్రాంగం ఊరేగింపుగా కదిలి తన క్లినిక్‌లో పేషెంట్లను చూస్తున్న డాక్టర్‌గారిని హత్యచేసారు.

ఆ తరువాత వరంగల్‌లో హంతకరాజ్యం మరింత తీవ్ర రూపంలో కొనసాగింది. విద్యార్థులనూ యువజనులనూ ఊరి నడిబొడ్డులో కాల్చేసి హంటర్ రోడ్లో ఎన్‌కౌంటర్ అయిందన్నారు. భట్టుపల్లి హమా లను ఇంటి నుండి తీసుకుపోయి హతమార్చి మాకేమీ తెలియదన్నారు. గుర్తు తెలియని మేఘ్యంను హనుమకొండ చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్‌కు వేళ్ళాడదీసారు. రైతుకూలీల తలలోనాలుక అయిన పూలక్కనూ కాల్చేసారు. ఇంకెందరినో చంపారు. ఇంకెందరో 'మాయం' అయ్యారు.

అటువంటి వాతావరణం అలముకున్న వరంగల్‌లో పౌరహక్కుల గళం వినబడడానికి అవకాశమేదీ?

ఈ హంతక రాజ్యం ఇక సాగబోదని కొత్త ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ప్రకటించాడు. ప్రజల సమస్యల నుండి ఉత్పన్నమయ్యే రాజకీయ ఉద్యమాలతో రాజకీయంగానే వ్యవహరిస్తాము తప్ప తుపాకులు ప్రయోగించి అణచబోమన్నాడు. అది ఎంత నిజమయిన ప్రకటనో హైదరాబాద్‌లో 'మాయం' అయి కరీంనగర్‌లో శవమయి తేలిన రెండు దశాబ్దాల వరంగల్ జిల్లా కమ్యూనిస్టు నాయకుడు అంతిరెడ్డి చెప్పగలరు. భూములు ఆక్రమించుకున్నారన్న నెపంతో రోజూ పోలీసులు చేసే దాడుల ఫలితంగా భయభ్రాంతులయిన గ్రామీణ ప్రజలు చెప్పగలరు.

ఈ నేపథ్యంలో డా॥ రామనాథం అయిదవ వర్ధంతిని ఈసారి వరంగల్‌లో జరుపుతున్నాం. విద్యార్థి దశనుండి అభ్యుదయ పక్షపాతిగా పేరుపొంది, కులాంతర వివాహాల నుండి పౌరహక్కుల ఉద్యమం దాకా అన్ని ప్రజాస్వామిక పోరాటాలకూ అండగా నిలబడిన పౌరహక్కుల రామనాథంను, ప్రజల డాక్టరు రామనాథంను, ఆయనను ప్రేమగా గుర్తుంచుకొన్న ప్రజల మధ్య స్మరించుకుంటున్నాం.

పౌరహక్కుల గళానికే కాదు, ఏ గళానికయినా వినిపించడానికి అవకాశంలేని స్థితి ఎన్నడూ కలగకూడదని డాక్టరుగారు భావించారు. తనకు వరంగల్‌లో వున్న కొద్దిపాటి భూమిలో పౌరహక్కుల సంఘం ఒక హాలు నిర్మించి ఏ భావాలు గలవారికయినా ఎటువంటి పరిస్థితిలోనయినా సభలూ సమావేశాలూ జరుపుకునే స్వేచ్ఛ కలిగించాలని కోరారు. ఆ కోరిక మేరకు అటువంటి సభాస్థలం నిర్మించాలని పౌరహక్కుల సంఘం నిర్ణయించింది. దాని కోసం డా॥ అంజద్ అలీ, ప్రజాకవి కాళోజీ తదితరులతో ఒక కమిటీ ఏర్పాటయింది. ప్రజల సహకారంతో డాక్టర్‌గారి కోరికను వచ్చే సంవత్సరం ఈ దినానికి తీర్చగలుగుతామని ఆశిస్తాం.

సెప్టెంబర్ 3-9-1990

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం.